సాక్షి
ప్రకాశం
బుధవారం । 21 । ఫిబ్రవరి । 2024



## నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ జిల్లాలోని అధికారులను హెచ్చరించారు.

- 8లో..



## డబుల్ ఇంజన్‌తో కొండపి అభివృద్ధి

రాబోయేది జగనన్న ప్రభుత్వమేనని. కొండపి నియోజకవర్గంలో కూడా వైఎస్సార్ సీపీని గెలిపించుకుంటే డబుల్ ఇంజన్‌తో అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి సురేష్ అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
33/23

## వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

### న్యూస్‌రీల్

## 23న ఒంగోలుకు సీఎం వైఎస్ జగన్ రాక

- పెడ్యూలు విడుదల చేసిన సీఎం కార్యాలయం



ఒంగోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 23న ఒంగోలు పర్యటనకు సంబంధించి షెడ్యూల్ ఖరారైంది. ఈ మేరకు సీఎం అదనపు వ్యక్తిగత కార్యదర్శి కె.నాగేశ్వరరెడ్డి షెడ్యూలు విడుదల చేశారు. ఒంగోలు నగర పరిధిలోని నిరుపేదలు 25 వేల మందికి ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉదయం 9.40 గంటలకు తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.15 గంటలకు ఒంగోలు అగ్రహారం వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. పది నిముషాల పాటు ప్రజా ప్రతినిధులను కలుసుకుంటారు. అక్కడ నుంచి అగ్రహారం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న ఇంటి స్థలాల లేఔట్ పైలాన్ వద్దకు చేరుకుంటారు. 10.40 గంటలకు సభావేదికకు చేరుకుంటారు. 10.45 గంటలకు ఒంగోలు తాగునీటి ప్రాజెక్టుకు సంబంధించి శంకుస్థాపన చేస్తారు. 10.50 నుంచి 11 గంటల వరకు ప్రదర్శన స్టాల్స్‌ను పరిశీలిస్తారు. 11.05 గంటలకు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సభ పరిచయ వాక్యాలను వినిపిస్తారు. మరో 10 నిముషాలపాటు వేదికపై ప్రజాప్రతినిధులు ప్రసంగిస్తారు. 11.25 నుంచి 11.35 గంటల వరకు లబ్ధిదారులు తమ సంతోషాన్ని సీఎంతో పంచుకుంటారు. 11.35 నుంచి 12.35 వరకు గంట పాటు సీఎం లబ్ధిదారులు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 12.35 గంటలకు అదనపు సీసీఎల్ ఏఎండీ ఇంతియాజ్ వందన సమర్పణతో సభ ముగుస్తుంది. 12.40 గంటలకు వేదిక వద్ద నుంచి బయల్దేరి 12.45 గంటలకు హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు. గంటపాటు స్థానిక నేతలతో ముఖాముఖి సమావేశం అవుతారు. 1.50 గంటలకు హెలికాప్టర్‌లో బయల్దేరి 2.25 గంటలకు తాడేపల్లికి చేరుకుంటారు.

## ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

ఒంగోలు అర్బన్: స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లు భద్రపరిచిన గోడౌన్‌ను మంగళవారం కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పరిశీలించారు. ఎన్నికల కమిషనర్ మార్గదర్శకాల మేరకు నిర్వహించిన తనిఖీల్లో ఈవీఎం, వీవీప్యాట్‌లు భద్రపరిచిన తీరు, గోడౌన్‌కు వేసిన తాళాలు, సీళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భద్రతా ఏర్పాట్లను పరిశీలించి తగిన సూచనలు చేశారు. దీనిలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.



అగ్రహారం వద్ద ఇంటి స్థలాల పంపిణీకి సిద్ధంగా ఉన్న జగనన్న కాలనీ లే అవుట్

# పేదల స్థలం.. సిద్ధం

ఒంగోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతులమీదుగా ఈనెల 23న పంపిణీ చేయనున్న ఇళ్ల పట్టాలకు సంబంధించిన ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ఇప్పటికే నర్సాపురం అగ్రహారంలో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన భూములను చదును చేసి ప్లాట్లు ఏర్పాటు చేసి హద్దురాళ్లు వేసే ప్రక్రియ జోరందుకుంది. ఇంకో వైపు రోడ్ల కోసం కేటాయించిన ప్రాంతాన్ని చదునుచేసే ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. ఇక అక్కడే సీఎం రాక కోసం ఏర్పాటు చేస్తున్న హెలిపాడ్ నిర్మాణ ప్రక్రియ ప్రారంభం కావడంతో పాటు హెలిపాడ్ నుంచి సీఎం సభాస్థలికి వచ్చే మార్గంలో రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు.



జగనన్న కాలనీ లే అవుట్‌లో రోడ్డు వేస్తున్న దృశ్యం



జగనన్న కాలనీ లే అవుట్‌లో రోడ్డుకు కంకర పోస్తున్న దృశ్యం



ఇళ్ల ప్లాట్‌కు కొలతలు వేస్తున్న సర్వేయర్లు



జగనన్న కాలనీ లే అవుట్‌లో నాటిన మొక్కలు



జగనన్న కాలనీ లే అవుట్‌లో వేసిన రోడ్డు, ఇరువైపుల నాటిన మొక్కలు





సచివాలయంలో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న మహిళలు

## సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లను పరిశీలించిన బాలినేని

ఒంగోలు: సచివాలయాల్లో జరుగుతున్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్వయంగా పరిశీలించారు. ఉదయం స్థానిక 44వ డివిజన్ మారుతీ నగర్, 45వ డివిజన్ శ్రీనగర్ కాలనీ, 11వ డివిజన్ క్లౌపేట, 13వ డివిజన్ కబాడీపాలెం, 20వ డివిజన్ భాగ్యనగర్, 21వ డివిజన్ ధారావారితోట, 30వ డివిజన్ విజయనగర్ కాలనీల 4వ డివిజన్ ఇస్లాంపేట, 49వ డివిజన్ సత్యనారాయణపురంలో సచివాలయాలను పరిశీలించి రిజిస్ట్రేషన్‌కు వచ్చిన లబ్ధిదారులతో మాట్లాడారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతున్న తీరును పరిశీలించగా లబ్ధిదారులు తమ సొంతింటి కలను సాకారం చేసేందుకు మీరు చూపుతున్న అభిమానం మీపై పెంచుకున్న విశ్వాసాన్ని రెట్టింపు చేసిందన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీకి మీరు పడుతున్న తపన, శ్రద్ధ మేము జీవితంలో మరువలేమన్నారు. తప్పకుండా మిమ్మల్ని మరోమారు గెలిపించుకుని సొంతింటి నిర్మాణాన్ని కూడా మీ చేతులతోనే ప్రారంభించుకుంటామని సంతోషాన్ని వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ఈనెల 23న శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి పట్టాల పంపిణీ ప్రక్రియను ప్రారంభించేందుకు ఇళ్లస్థలాల కోసం ఏర్పాటు చేసిన అగ్రహారం లేఅవుట్‌కు వస్తున్నారని, ప్రతి ఒక్కరూ తప్పకుండా వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బాలినేని వెంట మేయర్ గంగాడ సుజాత ఉన్నారు.



45వ డివిజన్ సచివాలయంలో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత

### ఆడపిల్లల వివాహాలకు

# ప్రభుత్వం అండ

- జిల్లాలో కళ్యాణమస్తు, తోఫా కింద 416 మందికి రూ.3.43 కోట్ల లబ్ధి
- 5వ విడత వైఎస్‌ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫాలో కలెక్టర్ దినేష్‌కుమార్
- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు



వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఆడపిల్ల వివాహాలు తల్లిదండ్రులకు భారం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్‌ఆర్ కళ్యాణమస్తు, వైఎస్‌ఆర్ షాదీ తోఫా పథకం ద్వారా వెన్నుదన్నుగా నిలుస్తోందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం వీడియో సమావేశం ద్వారా కళ్యాణమస్తు, షాదీ తోఫా కింద అక్టోబర్, డిసెంబర్–2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి వారి ఖాతాల్లోకి జమ చేసే కార్యక్రమం నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వైఎస్ ఆర్ కళ్యాణమస్తు, వైఎస్‌ఆర్ షాదీ తోఫా పథకం కింద 5వ విడతలో అక్టోబర్, డిసెంబర్–2013 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 416 మంది లబ్ధిదారులకు రూ.3 కోట్ల 43 లక్షల 50 వేల లబ్ధి చేకూరిందని తెలిపారు. 416 మంది లబ్ధిదారుల్లో ఎస్సీలు 202, ఎస్టీలు 10, బీసీలు 196, మైనారిటీస్ ఐదుగురు లబ్ధిదారులు ఉన్నట్లు వివరించారు. ఎస్సీ, ఎస్టీల్లో కులాంతర వివాహాలు చేసుకున్న వారికి రూ.1.20 లక్షలు, దివ్యాంగుల కేటగిరీ కింద రూ.1.50 లక్షలు వధువు తల్లి ఖాతాల్లో ఆర్థిక సహాయం జమ చేస్తారన్నారు. గత నాలుగు విడతలతో పాటు 5వ విడతతో కలిపి జిల్లాలో మొత్తం 1901 మంది లబ్ధిదారులకు రూ.16.91 కోట్లు ఆర్థిక సహాయం అందిస్తారన్నారు. ఆడపిల్లలు పుట్టిన వెంటనే వారి తల్లిదండ్రులు ఒక భారంగా ఆలోచిస్తున్న సమయంలో ఆడపిల్లల తల్లిదండ్రులకు భారం కాకూడదనే మంచి ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ పథకం ద్వారా తోడ్పాటును అందిస్తున్నారన్నారు. కార్యక్రమానికి హాజరైన జంటలు డిగ్రీ, పీజీ వరకు చదువుకుని ఉండటం సంతోషం కలిగిస్తోందన్నారు. గతంలో జిల్లాలో బాల్య వివాహాలు పెద్ద సంఖ్యలో జరిగాయని, గత రెండు సంవత్సరాలు గా గణనీయంగా తగ్గించామన్నారు. ఇటువంటి కార్యక్రమం అమలు చేస్తున్న ముఖ్యమంత్రికి లబ్ధిదారుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు ఆర్థిక సహాయానికి సంబంధించిన మెగా చెక్‌ను అందజేశారు.

### కళ్యాణమస్తుతో సంతోషంగా ఉన్నాం



మేము ఎస్సీ కులానికి చెందిన వారం. అయితే నేను కులాంతర వివాహం చేసుకున్నాను. వివాహ ఖర్చుల కోసం వైఎస్‌ఆర్ కళ్యాణమస్తు ద్వారా రూ.1.20 లక్షల ఆర్థిక సహాయం అందింది. దీంతో మా అమ్మతో పాటు కుటుంబం మొత్తం ఎంతో సంతోషంగా ఉన్నాం. తండ్రి మరణించడంతో ఆడపిల్లలకు పెళ్లి చేసేందుకు మా అమ్మ ఎంతో ఆర్థికంగా ఇబ్బందులు పడింది. పేద కుటుంబాలకు ఆడపిల్లల పెళ్లి ఖర్చుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇస్తున్న ఆర్థిక సహాయం మరువలేం. ముఖ్యమంత్రికి పేదలందరి తరపున కృతజ్ఞతలు. ఈ పథకం ఎన్నో పేద కుటుంబాలకు అండగా నిలుస్తోంది.

– అట్లూరి అన్నా మౌనిక, ఒంగోలు

### నిరుపేదలకు షాదీ తోఫా ఎంతో అండ



నిరుపేదలకు వైఎస్ ఆర్ షాదీ తోఫా ఎంతో అండగా నిలుస్తోంది. మా తండ్రి కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆడపిల్లలకు పెళ్లి చేయడంలో తల్లిదండ్రులకు ఆర్థికంగా ఎంతో భారంగా ఉంటోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద తల్లిదండ్రులకు ఆడపిల్లల వివాహాలు భారం కాకూడదనే ఉద్దేశంతో చేపట్టిన వైఎస్‌ఆర్ తోఫా కింద మాకు రూ.1 లక్ష మంజూరైంది. దీంతో కుటుంబం ఎంతో సంతోషం వ్యక్తం చేసింది. ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– షేక్ తస్లీమా, ఇస్లాంపేట, ఒంగోలు

## అసూయ, కడుపుమంటతోనే అసత్య ఆరోపణలు

- మంత్రి ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ (మర్రిపూడి): ప్రతిపక్షాలు అసూయ, కడుపు మంటతోనే అసత్య ఆరోపణలు చేస్తున్నాయని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. సింగరాయకొండ మండలం కనుమళ్ల పంచాయతీలో మంగళవారం రాత్రి 'పల్లెకు పల్లెకు సురేష్ అన్న సిద్ధం' కార్యక్రమంలో మంత్రి సురేష్ పాల్గొన్న సందర్భంగా విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అవినీతి రహితంగా, ప్రజారంజకంగా పాలన చేస్తుంటే ప్రతిపక్షాలు ఏం ఆరోపణలు చేయాలో పాలుపోక తమకు ఇష్టం వచ్చినట్లు అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారని అన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారమే ప్రకాశం జిల్లా నుంచి గుంటూరు జిల్లాకు అధికారులందరినీ బదిలీ చేశారే తప్ప తన ప్రమేయం ఏమీ లేదన్నారు. గతంలో ఎమ్మెల్యే స్వామి అధికారంలో ఉన్నప్పుడు అవకతవకలకు పాల్పడి ఉంటారని ఆరోపించారు. కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో అధికారులు బదిలీ అయ్యారని, కానీ ఒక్కచోట మాత్రం సీసీఎల్ఏ వారు పరిపాలనా సౌలభ్యం కోసం అధికారుల కొరత కారణంగా నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారే తప్ప తన ప్రమేయం లేదని సాధారణ బదిలీలు మాత్రమేనని వివరించారు. ఎమ్మెల్యే స్వామి అన్నట్లు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చని చెప్పారు. గత ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయం చేస్తూ కలెక్టర్లు మా కార్యకర్తలను బాగా చూసుకోమని ముక్కు సూటిగా పోవద్దని ముక్కు బద్దలవుద్దని చెప్పిన విషయాన్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదని గుర్తు చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సురేష్



ప్రమాదానికి కారణమైన కారు



బోరున విలపిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

# దూసుకొచ్చిన మృత్యువు

- ఆటోను కారు ఢీకొనడంతో ముగ్గురు దుర్మరణం
- బేస్తవారిపేట మండలం పూసలపాడు సమీపంలో వేకువజామున ఘోరప్రమాదం
- మృతుల్లో ఇద్దరు రైతులు, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ
- ప్రమాదంలో ఆటో తగలబడి ఇద్దరు సజీవ దహనం
- గుంటూరు యార్డులో మిర్చి విక్రయించి వస్తూ మృత్యుఒడికి
- కారులో ఉన్న తండ్రికొడుకులకు, ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

బేస్తవారిపేట: మిర్చిపంటను విక్రయించి సంతోషంగా ఇంటికి వెళ్తున్న ముగ్గురు రైతులను కారు రూపంలో మృత్యువు కబళించింది. ఎదురుగా వస్తున్న ఆటోను కారు ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. అన్నదాతల కుటుంబాల్లో పెనువిషాదం నింపిన ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో బేస్తవారిపేట మండలంలోని పూసలపాడు సమీపంలో కడప–అమరావతి రహదారిపై చోటుచేసుకుంది. ఆటోను కారు ఢీకొనడంతో ఆటో నుజ్జు నుజ్జు అయి పల్టీలు కొట్టింది. ఆటోలోని ఆయిల్ ట్యాంకర్ నుంచి ఆయిల్ బయటకు చిమ్మడంతో మంటలు అంటుకున్నాయి. సంఘటనను గమనించిన రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఆటోలో చిక్కుకున్న ముగ్గురిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. ఆటోలో చిక్కుకున్న చిత్తారు వెంకటేశ్వర్లు (53)ను బయటకు తీశారు. మిగిలిన ఇద్దరు చిత్తారు వెంకటరాములు(40), బిల్లా చిన్న వెంకటేశ్వర నాయుడు(28)లను బయటకు తీసేందుకు ప్రయత్నించినా లోపల చిక్కుకుని రాకపోవడం, మంటలు వ్యాపించడంతో ప్రయత్నాలు ఫలించలేదు. చిత్తారు రాములు, బిల్లా చిన్న వెంకటేశ్వర నాయుడు ఆటోలోనే దహనమయ్యారు. అప్పటికే వెంకటేశ్వర్లు తీవ్ర గాయాలతో మృతిచెందాడు. బిల్లా చిన్న వెంకటేశ్వరనాయుడు సీఎస్ పురం మండలం నల్లమడుగుల సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ప్రతి ఆదివారం ఇంటికి వచ్చి పొలం పనుల్లో తండ్రి పెద్ద వెంకటసుబ్బానాయుడికి సహాయం చేస్తుంటాడు. ఆదివారం ఎండుమిర్చి బస్తాలను తీసుకుని తండ్రి వెంకట సుబ్బానాయుడు వెళ్తానని చెప్పినా వద్దని చెప్పి వెళ్లాడు. ఈ సంఘటనలో ఆటోలోంచి ఎగిరి రోడ్డుపై పడిన డ్రైవర్ షేక్ ఖాశీంసా కాలు విరిగి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఢీకొట్టి కారు పల్టీలు కొట్టడంతో కారులో ఉన్న తండ్రికొడుకు గురవయ్య, ఓబయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కంభం అగ్నిమాపకదళ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.



దగ్ధమవుతున్న ఆటోలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

### రూ.10 లక్షల నగదు అగ్నికి ఆహుతి ...

బిళ్ల చిన్న వెంకటేశ్వరనాయుడు తన కుటుంబంతోపాటు దగ్గరి బంధువులు, గ్రామంలోని కొందరి రైతులకు చెందిన ఎండు మిర్చిని బొలెరో వాహనంలో గుంటూరు మిర్చియార్డ్‌కు తీసుకెళ్లాడు. మిర్చి అమ్మడంతో రూ.10 లక్షల నగదు వచ్చింది. వెంకట రాములు, చిన్నవెంకటేశ్వరనాయుడు మంటల్లో కాలిపోవడంతో వారివద్ద ఉన్న నగదు కాలిపోయింది. చిత్తారు వెంకటేశ్వర్లు మిర్చి అమ్మడంతో వచ్చిన నగదు రూ.1.87 లక్షలను క్లాత్ సంచిలో పెట్టి నడుము చుట్టూ కట్టుకున్నాడు. కాలుతున్న ఆటోలోంచి వెంకటేశ్వర్లును బయటకు తీయడంతో నగదు కాలిపోలేదు.

### అన్నకోసం తమ్ముడు వెళ్లి...

చిత్తారు వెంకటేశ్వర్లు, చిత్తారు రాములు అన్నదమ్ముళ్లు. వెంకటేశ్వర్లు మొదటి సారి మిర్చి పంట సాగు చేశాడు. గుంటూరు మిర్చి మార్కెట్ యార్డ్‌కు తోడు రావాలని తమ్ముడు రాములును కోరాడు. అన్నకోసం తోడుగా వెళ్లిన తమ్ముడు రోడ్డు ప్రమాదంలో సజీవ దహనమయ్యాడు.

### గ్రామంలో విషాదఛాయలు..

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అన్నదమ్ముళ్లు వెంకటేశ్వర్లు, వెంకటరాములు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ చిన్న వెంకటేశ్వరనాయుడు ముగ్గురిది బార్లకుంట. ఒకేసారి ముగ్గురు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు. వెంకటేశ్వర్లుకు భార్య నారాయణమ్మ, ముగ్గురు పిల్లలు, వెంకటరాములుకు భార్య నారాయణమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటన స్థలాన్ని ట్రైనీ డీఎస్పీ షేక్ షబ్బాజ్ అహ్మద్, సీఐ రామకోటయ్య పరిశీలించారు.



తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ ఖాశీంసా



మృతిచెందిన వెంకటేశ్వర్లు

# నికరంపల్లిలో వ్యక్తి దారుణ హత్య

- వివాహేతర సంబంధమే కారణమని పోలీసుల అనుమానం



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

**మార్కాపురం రూరల్:** మండలంలోని నికరంపల్లిలో మీనిగ వెంకటేశ్వర్లు (35) సోమవారం అర్ధరాత్రి దారుణహత్యకు గురయ్యాడు. మార్కాపురం రూరల్ పోలీసుల కథనం మేరకు..వెంకటేశ్వర్లు సోమవారం రాత్రి యధావిధిగా భోజనం చేసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఇంట్లోకి వచ్చి కత్తితో విచక్షణారహితంగా పొడవటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఎం కాశీ రామిరెడ్డి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు కుటుంబసభ్యులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని పోలీసులు భావించి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక అబ్బాయి ఉన్నారు. తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ ఎం సుందరరావు, సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, ఎస్సై వెంకటేశ్వరనాయక్‌లు సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించారు. నిందితున్ని త్వరలో పట్టుకుంటామని సీఐ తెలిపారు.

# టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

- బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ శివశ్రీనివాసులు



విద్యార్థులతో మాట్లాడుతున్న బీసీ వెల్ఫేర్ డైరెక్టర్, ఇతర అధికారులు

**త్రిపురాంతకం:** పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులు తగిన లక్ష్యంతో ముందుకు సాగాలని బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ జె.శివ శ్రీనివాసులు సూచించారు. త్రిపురాంతకం బీసీ హాస్టల్లో పదో తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు వినియోగించుకుని చదువులో రాణించాలన్నారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు భవిష్యత్ విద్యావకాశాల గురించి వివరించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్రంలోని అన్ని వసతి గృహాల్లో విద్యార్థులకు తగిన సౌకర్యాలను ప్రభుత్వం మెరుగుపరిచిందని చెప్పారు. జాయింట్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి, వెల్ఫేర్ అధికారులు అంజలి, జబ్బార్, హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.





# డబుల్ ఇంజన్‌తోనే కొండపి అభివృద్ధి

- కొండపి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టో అమలు
- టీడీపీ జమానాలో కొండపిలో అభివృద్ధి, సంక్షేమం శూన్యం
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్



వైఎస్సార్ హెల్త్ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సురేష్

**సింగరాయకొండ(మర్రిపూడి):** కొండపి నియోజకవర్గ అభివృద్ధి డబుల్ ఇంజన్‌తోనే సాధ్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, కొండపి ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. రాబోయేది జగనన్న ప్రభుత్వమని, కొండపిలోనూ వైఎస్సార్ సీపీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సింగరాయకొండ మండలంలోని కనుమళ్ల పంచాయతీ పెద్ద కనుమళ్ల, చిన్న కనుమళ్లలో మంగళవారం రాత్రి »పల్లె పల్లెకు సురేష్ అన్న సిద్ధం« కార్యక్రమంలో మంత్రి సురేష్ పాల్గొన్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ.. కనుమళ్ల పంచాయతీలో సుమారు 3 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. రాష్ట్రంలో గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్, మిల్క్ సెంటర్, డిజిటల్ లైబ్రరీలకు సంబంధించి 30 వేల భవనాలు నిర్మించారని, ఇది కదా అభివృద్ధి అని అన్నారు. గతంలో పంచాయతీ భవనాలు పెచ్చులూడిపోయి, తలుపులు విరిగి ఉండేవని, కొన్నింటిని అసలు తెరిచేవారు కాదని, కానీ నేడు గ్రామ సచివాలయాలు ఆర్‌డీఓ కార్యాలయాలకు దీటుగా ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్థాయికి పరిపాలన తీసుకొచ్చారన్నారు. నాడు-నేడు, అమ్మఒడి, గోరుముద్ద, విద్యా కానుక తదితర పథకాల అమలుతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు.

**కొండపి అభివృద్ధికి కృషి**

తాను ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన రెండు నెలల వ్యవధిలోనే నియోజకవర్గ అభివృద్ధి ఏవిధంగా చేయవచ్చో చూపించానన్నారు. దాదాపు 10,500 ఎకరాల ఆయకట్టు ఉన్న 22 కిలోమీటర్ల పీబీ చానల్‌ను ఎంపీ మాగుంట సహకారంతో అభివృద్ధి చేస్తున్నానన్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా బోర్ల మరమ్మతులు చేయించడంతోపాటు కొత్త బోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలపారు. కొండపి నియోజకవర్గ అభివృద్ధికి మండలాల వారీగా మేనిఫెస్టో రూపొందించి, అమలుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సంగమేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేస్తానని, మర్రిపూడి, చీమకుర్తి మధ్య చెక్‌డ్యాం నిర్మిస్తానని మంత్రి పేర్కొన్నారు. దళితవాడల్లో సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీటికి ఇబ్బంది లేకుండా కృషి చేస్తానని వాగ్దానం చేశారు. గ్రామ సచివాలయ కాంప్లెక్స్ స్థలదాతలకు మంత్రి సురేష్ ధన్యవాదాలు తెలిపారు. ముందుగా కనుమళ్లలో మంత్రికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, చర్చిల్లో ప్రార్థనలు చేశారు. చిన్న కనుమళ్లలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు.

**వైఎస్సార్ సీపీలోకి 10 కుటుంబాలు**

టీడీపీ మద్దతుదారు, వార్డు మెంబర్ కట్టా తిరుపతి మరో పది కుటుంబాలు మంత్రి సురేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి సురేష్ తనయుడు విశాల్, ఎంపీపీ కట్టా శోభారాణి, సర్పంచ్ మలినేని ఇందిర, పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షుడు మలినేని వెంకటేశ్వర్లు, పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, నవీన్ రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మాధవి, పంచాయతీరాజ్ డీఈ రవిబాబు, ఏఈ కోటా శ్రీహరి, ఏడీఏ నిర్మలకుమారి, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, కట్టా ఆనంద్, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చుక్కా కిరణ్‌కుమార్, షేక్ నౌషాద్, చిడిపూడి కృష్ణారెడ్డి, హరికృష్ణ, కుమార్ పాల్గొన్నారు.

# ఆరోగ్య సురక్షలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- నిర్లక్ష్యం వహించే అధికారులకు షోకాజ్ నోటీసులు
- ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగంగా పూర్తి చేయాలి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

**ఒంగోలు అర్బన్:** జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రకాశంభవనం నుంచి మంగళవారం పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణలో ఓపీ రిజిస్ట్రేషన్లు తక్కువగా ఉన్న వెలిగండ్ల ఎంపీడీఓ, మెడికల్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత చేపట్టిందని తెలిపారు. స్పెషలిస్టు వైద్యులతో గ్రామస్థాయిలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించడంతో పాటు వ్యాధి తీవ్రతను బట్టి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు కేసులను రిఫర్ చేసేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఎంపీడీఓలు, మెడికల్ ఆఫీసర్‌లు సమన్వయంతో పనిచేసి కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. జిల్లా సగటు ఓపీ రిజిస్ట్రేషన్ కంటే తక్కువగా ఉన్న వెలిగండ్ల ఎంపీడీఓ, మెడికల్ ఆఫీసర్‌లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్లు, ఏఎన్ఎంల ద్వారా ప్రజలకు వైద్య శిబిరాల గురించి విస్తృత అవగాహన కల్పించాలన్నారు. హౌస్ సర్వే 90 శాతం కంటే తక్కువగా ఉన్న వలంటీర్లను తొలగించాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగంగా పూర్తి చేయాలన్నారు. నిర్మాణాలు పూర్తయిన ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను సంబంధిత శాఖలకు అప్పగించాలన్నారు. నెలాఖరుకు ప్రజాప్రతినిధులతో వాటిని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాలకు సంబంధించి బిల్లులను కూడా నిబంధనల మేరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఉపాధి హామీ, జగనన్న స్వచ్ఛ సంకల్పం, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు మెరుగైన జీవనోపాధికల్పన తదితర అంశాలపై సమీక్షించారు. గణనీయమైన పురోగతి ఉండేలా పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఓ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ పద్మజ, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ హేమంత్, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, ఇరిగేషన్ ఎస్ఈ లక్ష్మారెడ్డి, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కలసికట్టుగా పార్టీని గెలిపించుకుందాం

- వైఎస్సార్ సీపీ గిద్దలూరు సమన్వయకర్త, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

**కంభం:** రానున్న 60 రోజులు కష్టపడి పనిచేసి వైఎస్సార్ సీపీని గెలిపించుకుంటే ఆ తర్వాత 60 నెలలు ఆనందంగా ఉండొచ్చని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహ ఆవరణలో మంగళవారం సాయంత్రం కంభం, అర్ధవీడు మండలాల ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో ఒక కొత్త వ్యవస్థను ముందుకు తీసుకొచ్చి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. వైనాట్ 175 అన్న దృఢ సంకల్పంతో జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకొని ముందుకు వెళ్తున్న తరుణంలో పలుచోట్ల అభ్యర్థుల మార్పులు జరిగాయని, అందులో భాగంగానే అన్నా రాంబాబును మార్కాపురం నియోజకవర్గానికి, గిద్దలూరుకు తనను పంపించారన్నారు. తాను గిద్దలూరులోనే స్థానికంగా నివాసం ఉంటూ అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతానన్నారు. నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీకి వెళ్లి అందరినీ పరిచయం చేసుకొని ప్రణాళిక ప్రకారం పనిచేసుకుంటూ ముందుకు సాగుదామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామాల్లో ఏవైనా చిన్నపాటి మనస్పర్థలు ఉంటే వాటిని విడనాడి అందరు కలిసికట్టుగా పనిచేసి గిద్దలూరులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దామన్నారు. నాయకులు ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అర్ధవీడు ఎంపీపీ ఎం వెంకట్రావు, మండల కన్వీనర్లు గొంగటి చెన్నారెడ్డి, చేగిరెడ్డి పోతిరెడ్డి, మాజీమార్కెట్ యార్డ్ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు డిష్‌మున్నా, తెల్లక్రిష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ నన్నెబోయిన రవికుమార్ యాదవ్, సర్పంచులు పల్నాటి బోడయ్య, రసూల్, మహబూబ్‌పీరా, నరాళ నాగార్జునరెడ్డి, మద్దు శ్రీనివాస్‌యాదవ్, వసంతమ్మ, ఉపసర్పంచ్ సయ్యద్‌ఖాసిం, కో ఆప్షన్ సయ్యద్ సలీం, వైఎస్సార్ సీపీ నాయకులు సబ్బసాని సాంబశివారెడ్డి, నరాళఈశ్వరరెడ్డి, శరబారెడ్డి, హుస్సేన్‌బాష, శివ, రెండు మండలాల ఎంపీటీసీలు, కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

- వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు
- చంద్రబాబు జమానాలో అభివృద్ధి, సంక్షేమం శూన్యమని విమర్శ
- వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కులు పంపిణీ
- 1890 డ్వాక్రా గ్రూపుల ఖాతాల్లో రూ.5.27 కోట్లు జమ



ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

**మార్కాపురం టౌన్:** రాష్ట్రంలో మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చారని, ప్రతి పథకంలో మహిళలకే తొలి అవకాశం కల్పించారని వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నగదు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 1890 డ్వాక్రా గ్రూపుల మహిళలకు రూ.5.27 కోట్ల చెక్కు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి, జగనన్న కాలనీలు, ఆసరా, చేయూత, సున్నా వడ్డీ తదితర పథకాలను మహిళల ఖాతాల్లోనే జమ చేసినట్లు తెలిపారు. నవరత్నాల ద్వారా పేద, మధ్య తరగతి ప్రజల్లో ఆర్థికాభివృద్ధిని తీసుకొచ్చిన ఘనత జగనన్నదేనన్నారు. 2019 ఎన్నికల ముందు వైఎస్ జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. డీబీటీ ద్వారా నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకే నగదు జమ చేస్తుండటంతో అవినీతికి ఆస్కారం లేకుండా పోయిందన్నారు. పేద పిల్లల చదువుకు దూరం కాకూడదని అమ్మఒడితో భరోసా ఇచ్చారన్నారు. నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతోపాటు ఇంగ్లిష్ మీడియం, ఐబీ సిలబస్ ప్రవేశపెట్టడంతో కార్పొరేట్‌కు దీటుగా నిలుస్తున్నాయన్నారు.

**చంద్రబాబు చేసిందేమీ లేదు**

గత టీడీపీ ప్రభుత్వం ఎన్నో హామీలిచ్చి ఏ ఒక్కటీ అమలు చేయలేదని ఎమ్మెల్యే అన్నా ధ్వజమెత్తారు. రాష్ట్ర విభజన తర్వాత అభివృద్ధి చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వానికి, వైఎస్ జగన్ పాలనను బేరీజు వేసుకోవాలని సూచించారు. ప్రజలకిచ్చిన మాట ప్రకారం సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి సీఎం వైఎస్ జగన్ ముందుకెళ్తున్నారన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రజల కష్టసుఖాల్లో భాగమవుతానని, అందరినీ సమానంగా చూసుకుంటానని, నీతి నిజాయితీగా వ్యవహరిస్తానన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీకి హాజరైన ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు మహిళలు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఏఎంసి చైర్మన్ మీర్జా షంషేర్ అలీబేగ్, ఎంపీపీ అరుణా చెంచిరెడ్డి, రాష్ట్ర వాల్మీకి, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ డైరెక్టర్లు ఎం కొండయ్య, మేడా బద్రీనాథ్, ఎంపిడిఓ తోట చందన, ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రంగారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ శ్రీనివాస రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, ఏపీఎం రమేష్ పలువురు మహిళలు పాల్గొన్నారు.

## మార్కాపురం ఎస్‌బీఐలో ఉన్నతాధికారుల అంతర్గత విచారణ

**మార్కాపురం:** మార్కాపురం ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో ఖాతాదారులైన మహిళల పేరుతో ఓ అధికారి ఫేక్ అకౌంట్లు సృష్టించి నగదు దారిమళ్లించిన వ్యవహారంపై ఆ బ్యాంకు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. 'మహిళల పేరుతో నాలుగు కోట్లు స్వాహా' శీర్షికన ఈ నెల 18న 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి బ్యాంక్ అధికారులు స్పందించారు. దీనికి స్పందించిన అమరావతి సర్కిల్ గుంటూరు మాడ్యూల్ డిప్యూటీ జనరల్ మేనేజర్, కందుకూరు రీజినల్ మేనేజర్‌తోపాటు పలువురు అధికారులు సోమ, మంగళవారాల్లో బ్యాంకుకు వచ్చి రికార్డులను పరిశీలించారు. పొదుపు సంఘాల మహిళలతోనూ మాట్లాడారు. ఈ విషయమై బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావును వివరణ కోరగా ఉన్నతాధికారులు వచ్చి అంతర్గత విచారణ చేస్తున్నారని తెలిపారు.

## రాయవరంలో పట్టపగలే చోరీ

- 60 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణ

**మార్కాపురం రూరల్:** మండలంలోని రాయవరం రైల్వే స్టేషన్ సమీపంలో ఫ్లయ్ ఓవర్ పక్క వీధిలో మంగళవారం పట్టపగలే దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్ము భూషణం ఆయన భార్య ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. సాయంత్రం 6 గంటలకు ఇంటికి చేరుకోగా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో దాచి ఉంచిన మూడు తులాల బంగారు గాజులు, మూడు తులాల నల్లపూసల దండ చోరీ అయినట్లు గ్రహించారు. సంఘటనా స్థలాన్ని రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్ తమ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఆర్థిక లావాదేవీలతో వ్యక్తిపై దాడి



చికిత్స పొందుతున్న మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి

**ఒంగోలు టౌన్:** ఆర్థిక లావాదేవీలతో జరిగిన ఘర్షణలో వ్యక్తిపై దాడి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని జయరాం థియేటర్ సమీపంలో డాక్టర్ మర్రెడ్డి రామచంద్రారెడ్డి జిమ్స్ ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు. డాక్టర్‌కు సమీప బంధువైన మర్రెడ్డి శ్రీనివాసరెడ్డితో వ్యాపార సంబంధాలు ఉన్నాయి. ఈ క్రమంలో శ్రీనివాసరెడ్డికి డాక్టర్ రామచంద్రారెడ్డి రూ.2 కోట్ల వరకు బాకీ పడ్డారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య కొద్ది రోజులుగా వివాదం నడుస్తుంది. అయితే బాకీ తాలుకా రూ.20 లక్షలు ఇస్తానని చెప్పడంతో శ్రీనివాసరెడ్డి మంగళవారం ఆస్పత్రికి వచ్చారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. అక్కడే ఉన్న డాక్టర్ వద్ద కాంపౌండర్‌గా పనిచేస్తున్న తుమ్మా బాలకోటయ్య అలియాస్ బాలు ఇనుప రాడ్డుతో శ్రీనివాసరెడ్డిపై దాడి చేసి కొట్టాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరెడ్డి అక్కడే రక్తపు మడుగులో పడిపోయారు. మృతి చెందాడని భయపడిపోయిన డాక్టర్ రామచంద్రారెడ్డి, బాలు అక్కడ నుంచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరెడ్డిని కారు డ్రైవర్ హుటాహుటిన ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. వన్‌టౌన్ సీఐ ఎం లక్ష్మణ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# యువతిని మోసగించిన నిందితుడికి పదేళ్ల జైలు

**ఒంగోలు టౌన్:** ప్రేమించానన్నాడు...పెళ్లి చేసుకుంటానన్నాడు. మాయమాటలతో దగ్గరయ్యాడు. నమ్మించి మోసం చేశాడు. ఈ కేసులో నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష విధించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిపాడు మండలానికి చెందిన పోకూరి మహేష్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మాయమాటలతో గర్భవతిని చేశాడు. అనంతరం అబార్షన్ చేయించాడు. తీరా పెళ్లి చేసుకుందామని అడిగే సరికి ముఖం చాటేశాడు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు 2018 జూలైలో మద్దిపాడు ఎస్ఐ పి.సురేష్ కేసు నమోదు చేశారు. సమగ్ర విచారణ అనంతరం అప్పటి సీఐ ఎం మురళీకృష్ణ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యత్తపు కొండారెడ్డి ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. ఎస్పీ సూచనలతో సమర్థవంతంగా విచారణ నిర్వహించి నిందితుడి నేరం నిరూపించడంతో జిల్లా రెండవ అదనపు కోర్ట్ న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ నిందితుడికి శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. పదేళ్ల జైలు, రూ.4000 జరిమానా విధించారు.

**నేరం చేస్తే శిక్షలు తప్పవు: ఎస్పీ పరమేశ్వరరెడ్డి**

యువతులను ప్రేమ పేరుతో నమ్మించి మోసాలకు పాల్పడే వాళ్లు ఎట్టి పరిస్థితుల్లోనూ శిక్ష నుంచి తప్పించుకోలేరని ఎస్పీ పి. పరమేశ్వరరెడ్డి చెప్పారు. మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి నేరాలకు పాల్పడేవారు చట్టం నుంచి తప్పించుకోలేని విధంగా గుడ్ ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి సమర్థవంతమైన ట్రయల్ ద్వారా నిందితులకు శిక్షలు పడేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కేసులో న్యాయస్థానంలో సరైన సాక్ష్యాధారాలను హాజరుపరిచి గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా నిందితుడికి జైలుశిక్ష పడేలా విధులు నిర్వహించిన ఎస్సై పి.సురేష్, సీఐ ఎం మురళీకృష్ణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ యత్తపు కొండారెడ్డి, కోర్ట్ లైజన్ ఎస్ లక్ష్మీనారాయణ, సమన్స్ అమలు పరిచిన మద్దిపాడు కానిస్టేబుల్ టి.వెంకటేశ్వర్లును ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## కోనవల్లభరాయస్వామిని తాకిన సూర్యకిరణాలు

**కురిచేడు:** మండల కేంద్రమైన కురిచేడు సమీపంలో కొండపై కొలువై ఉన్న రాజ్యలక్ష్మి, కోనవల్లభరాయస్వామివారిని మంగళవారం సూర్య కిరణాలు అభిషేకించాయి. ఆలయాల్లోని మూలవిరాట్లు ప్రభాత వేళ సూర్య కిరణాల వెలుగులో భక్తులకు దర్శనమిచ్చాయి. ఏటా ఉత్తరాయణ, దక్షిణాయన పుణ్యకాలాల్లో రెండు పర్యాయాలు మాత్రమే ఆవిష్కృతమయ్యే ఈ దృశ్యాన్ని తిలకించి భక్తులు తరించారు.



కోనవల్లభరాయస్వామిని అభిషేకిస్తున్న భానుడి కిరణాలు



సూర్య కిరణాల వెలుగులో రాజ్యలక్ష్మి అమ్మవారు